క్లుప్తంగా

కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బిక్కవోలు: గ్రామంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి


నల్గొండలో వరి ఆకుమడులను పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో గౌరీదేవి

సీతానగరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, వరి విత్తనాలను తప్పని సరిగా శుద్ధి చేసుకోని, ఆకుమడులు వేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎ.గౌరీదేవి రైతులకు సూచించారు. ఆమె మంగళవారం రాపాకలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నారుమడికి సరైన ఎరువుల యాజమాన్యం పాటించాలన్నారు. వరి ఆకు చిగురులు తుంచి నాటాలని, దీనివల్ల కాండం తొలుగు పురుగును 30 రోజుల వరకూ నివారించవచ్చన్నారు. నల్గొండ పరిధిలో వరి ఆకుమడులను పరిశీలించి, రైతులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో గురప్రియ, వీఏఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టేట్ ఫారెస్టు అకాడమీకి రేపు భూమి పూజ

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు ఏరియాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫారెస్టు అకాడమీ ఏర్పాటు చేయనున్నారు. సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో అకాడమీ భవనంతో పాటు స్టాఫ్ క్వార్టర్లు, స్విమ్మింగ్ పూల్, స్పోర్ట్స్ క్లబ్‌లను నిర్మించే విధంగా ప్రణాళిక రూపొందించారు. అకాడమీ నిర్మాణానికి గురువారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భూమి పూజ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు

సీటీఆర్ఐ: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం పీఎం ఉష స్కీమ్ కింద రూ.4,99,94,500 నిధులు మంజూరు చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆ నిధుల్లో రూ.నాలుగు కోట్లను సివిల్ వర్క్స్, 12 తరగతుల నిర్మాణానికి వినియోగిస్తారన్నారు. రూ.93,94,500లను సైన్స్‌ల్యాబ్ ఎక్విప్మెంట్, కంప్యూటర్స్, జిరాక్స్ మెషీన్ కోసం ఖర్చు చేస్తారని తెలిపారు. మరో రూ.6 లక్షలను సెమినార్లు, వర్క్ షాపులు, ప్రాజెక్టు ప్రచురణలకు వినియోగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పీఏ రాజబాబు, డాక్టర్ బి.రమణమూర్తి, జి.శరత్ బాబు, బీహెచ్‌వీవీఎన్ మూర్తి, డి.మధులత, ఎన్.ఇందిర, డాక్టర్ పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

ఎన్‌డీఏతో ఉన్నత శ్రేణి ఉద్యోగం

సీటీఆర్ఐ: దేశానికి సేవ చేసే అవకాశం, ఉన్నత శ్రేణి ఉద్యోగం, ఉత్తమ భవిష్యత్తుకు నేషనల్ డిఫెన్స్ అకాడమి (ఎన్‌డీఏ) అత్యుత్తమ ఎంపిక అని భారత వైమానిక దళంలో లాజిస్టిక్స్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగాన్ని సాధించిన పోతంశెట్టి జయంత్ దొర అన్నారు. అతడు ఉద్యోగం సాధించిన సందర్భంగా కుటుంబ సభ్యులు తమ సంతోషాన్ని మీడియాతో పంచుకున్నారు. భాస్కర్ నగర్ గోశాల గేటు ఎదుట రోడ్డులోని వారి స్వగృహం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జయంత్ దొర మాట్లాడారు. ఇంటర్మీడియట్ తర్వాత ఎన్‌డీఏలో సీటు సాధిస్తే చదువుతో పాటు ఉన్నత ఉద్యోగం సాధించడానికి మంచి అవకాశం ఉందన్నారు. తనకు చిన్నప్పటి నుంచి ఎయిర్‌ఫోర్స్‌లో చేరాలన్నది లక్ష్యమన్నారు. ఎన్‌డీఏలో మూడేళ్లు, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఐఏఏ)లో ఏడాది శిక్షణ తర్వాత (సర్వీస్ సెలక్షన్ బోర్డు) ఎస్ఎస్‌బీలో ఎంపికై, ఏడాది పాటు పైలెట్ శిక్షణ తీసుకోవడం జరిగిందన్నారు. పైలెట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించడం ద్వారా ఎయిర్‌ఫోర్స్‌లో చేరి దేశానికి సేవ చేయాలన్న తన స్వప్నాన్ని నెరవేర్చుకున్నానన్నారు. జయంత్ దొర తండ్రి శ్రీనివాస్ దొర మాట్లాడుతూ తమ కుమారుడు ప్రతిష్ఠాత్మక ఉద్యోగం సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, ఆయన మిత్ర బృందం జయంత్ దొరను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

వైద్యం దూరం.. రోగులకు భారం

- గత ప్రభుత్వంలో ఇంటింటా ఉచిత వైద్య సేవలు
- ఆ పథకాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- ఆస్పత్రుల చుట్టూ తిరగలేక దివ్యాంగులు, వృద్ధుల ఇబ్బందులు


పెదపూడిలో మందులు పంపిణీ చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి (ఫైల్)

పెదపూడి: ప్రస్తుత కాలంలో ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్నారు. ముఖ్యంగా బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. ఇలాంటి సమయంలో వైద్యం చాలా ప్రధానమని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. నిరుపేదలకు వైద్య సేవలను సులభతరం చేశారు. ఆయా గ్రామాల వద్దకే వైద్యులు, వైద్య సిబ్బంది తరలివెళ్లి, రోగులకు ఇంటి వద్దనే పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె ప్రజలకు అందే వైద్యం సేవలపై నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ఆస్పత్రులకు వెళ్లడానికి శక్తి లేని రోగుల పరిస్థితి దయనీయంగా మారింది.

జగనన్న పాలనలో..

పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించగలిగితే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. ప్రధానంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలను ఇంటి వద్దకే అందించాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులను గ్రామాల్లోని ప్రతి ఇంటికి పంపించేవారు. అక్కడి రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేవారు. ప్రతి నెలా తమ పరిధిలోని ఏరియాలకు వైద్యులు, సిబ్బంది తరలివెళ్లి, సుమారు 14 రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను రోగులకు పంపిణీ చేసేవారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైతే సమీపంలోని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అమలులో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించేవారు.

నిపుణులతో వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో నిపుణులైన వివిధ విభాగాలకు చెందిన సుమారు 8 మంది వైద్యులను రప్పించి ఆయా గ్రామాలు, పట్టణాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం నిరుపేదలకు అందే ఉచిత వైద్య సేవలన్నింటికీ మంగళం పాడింది. దీంతో అనారోగ్యం వస్తే ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని రోగులు, వృద్ధులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు కురుస్తుండడంతో పలు వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం, దోమల బెడద అధికమైన నేపథ్యంలో జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రజారోగ్యాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పూర్తిగా పడకేసింది.


జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఏపీత్రయంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరం (ఫైల్)

గతంలో ఇంటి వద్దకే వైద్యం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఇంటికి వచ్చి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించేవారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందించేవారు. కొద్ది నెలలుగా ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించిన దాఖలాల్లేవు. పేదల ఆరోగ్యాన్ని పట్టించుకునే నాథుడు లేడు. మాలాంటి వృద్ధులను దృష్టిలో ఉంచుకుని ఇంటింటా వైద్య సేవలను అందించాలి.

– డి.గోగులమ్మ కాండ్రేగుల, పెదపూడి మండలం

చర్యలు చేపట్టాలి



రోగుల ఇంటికి వచ్చి అవసరమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. గతంలో ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేసేవారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఇంట్లో ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నాం. కనీసం బీపీ, సుగర్ పరీక్షలు కూడా చేయడంలేదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి అవసరమైన వైద్య సేవలను ఇంటికి వచ్చి అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఎస్.జిట్లమ్మ, పెదపూడి

సొంత మండలంలో పోస్టింగులు ఇవ్వాలి


ఎంపీడీఓ నరేంద్రరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పెదపూడి: బదిలీ ప్రక్రియలో భాగంగా తమకు సొంత మండలంలో పోస్టింగ్‌లు ఇవ్వాలని సచివాలయం ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, మేడపాటి సత్యనారాయణరెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. సచివాలయం ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సొంత మండలంలోని గ్రామాల్లో పోస్టింగ్‌లు ఇచ్చి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కొల్లు నాగేంద్ర, వెంకట్, ప్రవీణ్, చిక్కాల రమేష్ ,దేవగుప్తాపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ప్రతిభ


అనూషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల ఎమ్మెస్సీ విద్యార్థిని ఎ.అనూష తాడేపల్లిగూడెంలోని నిట్‌లో పీహెచ్‌డీ ప్రవేశం పొందిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మంగళవారం తెలిపారు. ఆమె పరిశోధన, విద్యా రంగాల్లో ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా అనూషను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ధాన్యం బకాయిలు చెల్లించేదెప్పుడో!

- రైతుల ఖాతాలకు వెంటనే జమ చేయాలి
- అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో భారీ ధర్నా


పెదపూడిలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెదపూడి: రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను కూటమి ప్రభుత్వం తక్షణం చెల్లించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెదపూడి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ధర్నా చేశారు. ధాన్యం బకాయిలతో పాటు అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన రెండేళ్ల నిధులు రూ.40 వేలను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం తొలి సంవత్సరంలో అన్నదాత సుఖీభవ పథకం కింద నిధుల జమ చేస్తామని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వలేదని, ఇప్పుడు రెండో ఏడాది మొదలైనా ఇంకా ఆర్థిక సహాయం చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు రెండు సంవత్సరాల మొత్తం రూ.40 వేలు ఇవ్వాలన్నారు.

రైతులపై నిర్లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్ కింద ధాన్యం కొనుగోలు చేస్తామన్న వాగ్దానంతో కొందరికి చెల్లింపులు చేసి, మిగిలిన వందల మంది రైతులను నిర్లక్ష్యం చేశారన్నారు. పెదపూడి మండలంలో సుమారు 550 మంది రైతులకు రూ.55 కోట్ల మేర సీఎంఆర్ బకాయిలు నెల రోజులకు పైగా రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. అలాగే అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతులకు రావాల్సిన బకాయిలు జమ చేయించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు వేయించాలన్నారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మిల్లర్లతో కుమ్మక్కై తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులను తీవ్రంగా నష్టాలకు గురి చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎకరానికి సుమారు రూ.10 వేల వరకు రైతులు నష్టపోయారంటూ వాపోతున్నారని చెప్పారు. అనంతరం తహసీల్దార్ పీవీ సీతాపతిరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ గుత్తుల రమణ, మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, పార్లమెంటు నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల వెంకటరమణ, సమ్మంగి దుర్గాప్రసాద్, సుందరపల్లి సుధాకర్‌బాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, సుందరపల్లి వీరభద్రం, దొకుబుర్ర కృష్ణ, కాకర సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో అద్భుత విజయాలు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట: కృషి, పట్టుదల ఉంటే అద్భుత విజయాలు సాధించవచ్చునని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి అన్నారు. స్థానిక పాఠశాలలో పదో తరగతి చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన కోశెట్టి శ్యామ్‌కుమార్ (584), తన్నేటి బాల సూర్య ప్రసన్న (572)కు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు పేదరికం అడ్డురాదని నిరూపించిన శ్యామ్‌కుమార్, బాల సూర్య ప్రసన్న అభినందనీయులని కొనియాడారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ విజయాలు సాధించడానికి నేటి తరం విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరి ఎంపిక


జయమణిమంగ


వెంకటలక్ష్మి

బిక్కవోలు: ట్రిపుల్ ఐటీకి మండలంలోని ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈవో సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల చెందిన దాసరి జయమణిమంగకు నూజివీడులోనూ, కొంకుదురు ఉన్నత పాఠశాల చెందిన అంగటి వెంకటలక్ష్మికి ఒంగోలులోనూ సీట్లు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పలువురు అభినందించారు.

అధ్వాన రోడ్లతో పాడైపోతున్న బస్సులు


సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ దగ్గర ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకూ పది కిలోమీటర్ల మేర రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆర్టీసీ బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి. దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీతానగరం డిగ్రీ కళాశాల నుంచి పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డు గోతులమయంగా మారింది. పురుషోత్తపట్నం నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న పల్లె వెలుగు బస్సు మంగళవారం సీతానగరం నాగులు బొమ్మల సెంటర్ సమీపంతో ఒక్కసారిగా ఆగిపోయింది. గేర్ బాక్స్ నుంచి హౌజింగ్‌కు వెళ్లే జాయింట్ విరిగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీనితో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్.. ప్రయాణికులను సీతానగరం బస్‌స్టేషన్‌కు చేర్చి, వేరే బస్సులో రాజమహేంద్రవరం పంపించారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి


కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

బిక్కవోలు: మూడేళ్ల నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్ అన్నారు. కొమరిపాలెంలో మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన అందిన విద్య అందిస్తున్నామన్నారు. చదువుతో పాటు పౌష్టికాహారం కూడా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ద్వారంపూడి వెంకటరెడ్డి, సూపర్‌వైజర్ యు.పద్మ,శాంతి, రత్నకుమారి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్న కుట్టు, మగ్గం, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ కుట్టు, మగ్గం కోర్సులలో మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. కనీసం ఏడో తరగతి చదువుకున్న మహిళలు అర్హులన్నారు. కంప్యూటర్ కోర్సులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన మహిళలు, పురుషులు హాజరు కావచ్చన్నారు. బ్యూటీషియన్ కోర్సులలో మహిళలందరికీ ప్రవేశం ఉంటుందన్నారు. ఈనెల 30వ తేదీ సోమవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆ సమయంలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరిస్తామన్నారు. ఆసక్తి కలవారు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సంస్థను 98498 47489 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి


ఆర్‌డీఓ కృష్ణనాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

సీటీఆర్ఐ: కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కృష్ణనాయక్‌కు వినతిపత్రం అందించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడానికి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. ఇటీవల బాపట్ల జిల్లా రేపల్లె బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది కొండపల్లి శ్రీనివాసరావును దుండగులు హత్య చేసి, కృష్ణా నది ఒడ్డున పడవేశారన్నారు. ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సదరు న్యాయవాది మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించడంతోపాటు, న్యాయవాది కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. సొసైటీ రాష్ట్ర సహ కార్యదర్శి బీరా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొన్ని సినిమాల్లో న్యాయవాదులను, న్యాయవ్యవస్థను కించిపరిచే విధంగా మాట్లాడుతున్నారని, తక్షణం వీటిని నిరోధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రతినిధులు రామ్మోహన్, కూనరెడ్డి హేమంత్ శ్రీనివాస్, శ్రీలలిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

చిరు వ్యాపారం.. వర్షార్పణం

- పొట్టకూటి కోసం చిరు వ్యాపారుల పాట్లు
- వర్షాల కారణంగా తగ్గిన విక్రయాలు


పెదరాయవరంలో ఏడీబీ రోడ్డు పక్కన పండ్ల దుకాణం

రంగంపేట: నిన్న, మొన్నటి వరకు ఎండలు మండిపోయి వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగేవి. ఇప్పుడేమో వానలు పుణ్యమాని అసలు వ్యాపారమే లేకుండా పోతోంది. మెట్ట ప్రాంతంలోని చిరు వ్యాపారుల దీనస్థితి ఇది. ఏడీబీ రోడ్డు వెంబడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు, వ్యాపారులు తమ గ్రామాల్లోని పొలాల్లో పండించిన అనేక రకాల పండ్లు, కూరగాయలు, కాయలను విక్రయించుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే నిన్నటి వరకు మండుటెండలో నిలుచుని బేరాల కోసం ఎదురు చూపులు చూశారు. ఇప్పుడు అల్పపీడనం కారణంగా కురుస్తున్న వానలతో ఇబ్బంది పడుతున్నారు. కొనుగోలుదారులు లేక, వ్యాపారం సాగక అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు కూడా జరుగుతుండడంతో వారి జీవనోపాధి కష్టంగా మారింది.

వాతావరణ మార్పులు

ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో కాస్తో కూస్తో వ్యాపారం సాగేది. వాతావరణ మార్పుల కారణంగా వీస్తున్న గాలులు, కురుస్తున్న వర్షానికి ద్విచక్ర వాహనదారులు ప్రయాణాలు చేయక వ్యాపారం సాగడం లేదని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. కార్లలో ప్రయాణించేవారు మాత్రం వర్షం వెలుసుబాటు ఇస్తే కార్లు ఆపి కొద్దో గొప్పో కొనుగోలు చేస్తున్నారు. వర్షం కురుస్తుంటే మాత్రం కార్లలోంచి దిగడానికి ఇష్టపడక పోవడంతో వ్యాపారాలు బాగా మందగించాయని వాపోతున్నారు. వర్షాలకు పండ్లు, కూరగాయలు పాడవుతున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఆదాయం సగానికి పడిపోతుందని, కుటుంబ పోషణ కష్టంగా మారుతుందని చెబుతున్నారు.

పలు గ్రామాల్లో..

మండల పరిధిలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, రామేశంపేట తదితర ప్రాంతాల్లో ఏడీబీ రోడ్డు వెంబడి మండలంలోని అనేక గ్రామాలకు చెందిన పలువురు రైతులు, వ్యాపారులు సీజన్ వారీగా పండే మామిడి, జీడిమామిడి, నేరేడు, సపోట, బొప్పాయి, పనస, జామ తదితర రకాల పండ్లు, వంగ, బెండ, బీర, చిక్కుడు, కాకర, ఆకాకర, గోరు చిక్కుడు, ఆనబ తదితర కూరగాయలుతో పాటు ఆకు కూరలు, తాటి ముంజులు, కొబ్బరి బొండాలు, బుర్రగుంజు, ఈతపండ్లను విక్రయిస్తారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు, ఏడీబీ రోడ్డ విస్తరణ పనులతో వీరి వ్యాపారం సాగడం లేదు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మొదలైన ఈ సమావేశంలో పలు శాఖల అధికారులను సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. సింగవరం సర్పంచ్ సంగన చినపోశయ్య, మండల ప్రజా పరిషత్ సలహాదారులు చల్లమళ్ల సుజీరాజు మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశంలో అధికారుల మధ్య సుజీరాజును ఎందుకు కూర్చోబెడుతున్నారని నిలదీశారు. మండల సలహాదారుడిగా జీవో ఉందని, దానితోనే తనను నియమించారని, గతం నుంచి ఇదే విధంగా జరుగుతున్నా అభ్యంతరం చెప్పలేదని, కొత్తగా ఇప్పుడు అభ్యంతరం చెప్పడం ఎంతవరకు సబబని సుజీరాజు అన్నారు.

- రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లేన్ల రోడ్డులోని గ్రామాల వద్ద పలు కార్యక్రమాలు, ఉత్సవాల కోసం రోడ్డును బ్లాక్ చేయడంతో పలు ఇబ్బందులు పడుతున్నామని, తగు చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపారు. ఇదే రోడ్డులో కల్వర్టుల వద్ద రోడ్డు నిర్మించలేదని, రఘుదేవపురం నుంచి రాపాక కల్వర్టు వరకు రోడ్డు వేయలేదని, గోతుల కారణంగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని తెలిపారు.
- చీపురుపల్లి – చినకొండేపూడి లోకల్వర్టు తూరలు పగిలిపోయాయని, వంతెన నిర్మించాలని లేదా వాటి స్థానం కొత్త తూరలు వేయాలని అధికారులను కోరారు. దీనిపై అర్‌అండ్‌బీ ఏఈ వీరన్నబాబు మాట్లాడుతూ రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు కొత్త టెండర్లు పిలిచి పనులు చేపడతామన్నారు.
- సీతానగరం పంచాయతీలో 180 మందికి తల్లికి వందనం నగదు పడలేదని, ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు విద్యుత్ మీటర్లకు ఆధార్ నంబర్లు అనుసంధానం చేసి ఉన్నాయన్నారు. దీనిపై విద్యుత్‌శాఖాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సీతానగరం సర్పంచ్ కోండ్రపు ముత్యాలు కోరారు. ప్రజా ప్రతినిధులు పలు అంశాలపై అధికారులను నిలదీశారు. సమావేశంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, వైస్ ఎంపీపీ - 2 సత్యం మదనబాబు, ఎంఈవో స్వామి నాయక్, విద్యుత్ శాఖ ఏఈ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.